



ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం రూరల్ : ఉపాధ్యాయ సమస్యలపై అలసత్వం ప్రదర్శిస్తున్న మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా, మండల శాఖ నాయకులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ అడిగితే, సంఘ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటులో అనేక అక్రమాలు చేశారన్నారు. తనకు నచ్చిన వారిని ఆఫీసులో ఆన్ డ్యూటీపై పని చేయించుకుని, ఉపాధ్యాయులందర్నీ నీవు ఏ సంఘంలో ఉన్నావని అడిగి, యుటిఎఫ్‌లో ఉండొద్దని భయపెడుతున్నారని అన్నారు. సంఘ నాయకులతో ప్రజాసామ్యయుతంగా చర్చించకుండా మీరు రావద్దని బెదిరిస్తున్నారని అన్నారు. కావున వెంటనే తమ సంఘ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఎంఇఒ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష చర్య చేపడతామన్నారు. డిఇఒ వారు జోక్యం చేసుకుని ఆతనిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల నాయకులు రమేష్, ఎస్.మురళీమోహనరావు, వి.వసంతనాయుడు, కె.మురళి తెలిపారు.

మళ్లీ కరోనా కలవరం

- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ
- ప్రతి పిహెచ్‌సిలోనూ మూడు శాంపిల్ టెస్టులకు ఆదేశం
- తొలి రోజు 144 మందికి పరీక్షలు
- జాగ్రత్తగా మెసులుకోవాలంటున్న వైద్యులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మళ్లీ కరోనా కలవరం మొదలైంది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ (బిఎఫ్ 7) వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు వార్తలు వస్తుండడంతో ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. దీంతో, వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రతి పిహెచ్‌సిలోనూ కనీసం ముగ్గురికి చొప్పున పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలోని మొత్తం 48 పిహెచ్‌సిల్లో మొత్తం 144మందికి బుధవారం, గురువారాల్లో కరోనా పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగిటివ్ వచ్చినట్టు సమాచారం. అయినప్పటికీ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. 2019 డిసెంబర్‌లో ఫస్ట్‌వేవ్ కరోనా వచ్చిన విషయం విధితమే. మన జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో 2020 మేనెల వరకు గ్రీన్ జోన్‌లో ఉన్నాం. అనంతరం బలిజిపేట మండలం చిలకలపల్లిలో మే 20 తరువాత పాజిటివ్ కేసు నమోదైంది. అనంతరం వ్యాప్తి చెందడంతో జిల్లా అతలాకుతలమైంది. జనం భయం గుప్పెట్లో బతికారు. జనాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. లాక్‌డౌన్ వల్ల నిత్యవసర సరుకులు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఉపాధి కోల్పోవడంతో సరుకులు కొనుక్కోవడానికి డబ్బులు లేని దుస్థితి దాపురించింది. వలస కార్మికులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రవాణా సేవలు స్తంభించడంతో కాలినడకన అతి కష్టం మీద ఇళ్లకు చేరుకున్నారు. ఇక రెండో దశ కరోనాలో ఒకానొక దశకు వచ్చేసరికి వైద్యసేవలు అందించలేని పరిస్థితి. బెడ్స్ దొరక్క, ఇళ్ల వద్దకు వైద్యసేవలు, మందులు అందక మరణాల పరంపర కొనసాగింది. మొత్తంగా ఇప్పటి వరకు కరోనా వల్ల జిల్లాలో 654మంది చనిపోయారు. శ్మశానాల్లో శవాల గుట్టలు కనిపించాయి. భార్యా,భర్తలు, తల్లీపిల్లలు చనిపోయారు. కడచూపునకు నోచుకోలేని పరిస్థితి ఎదురైంది. లక్షలాది మంది కరోనా భారిన పడ్డారు. ఆయా సందర్భాల్లో వైద్యసేవల కోసం చేసిన ఇప్పులు ఇప్పటికీ తీర్చుకోలేక అప్పుల ఊబిలో సతమతమౌతున్నారు. కోల్పోయిన జీవనోపాధి ఇప్పటికీ కుదుటపడలేదు. ఇటువంటి పరిస్థితుల్లో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్నాయన్న వార్తలు వినిపిస్తుండడంతో జనాల్లో భయాందోళన మొదలైంది. ఇప్పటికే దేశంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులు నాలుగు నమోదైనట్టు వైద్యారోగ్యశాఖ ధ్రువీకరించింది. ఇందులో మన పొరుగు రాష్ట్రం ఒడిశాలో ఒకటి ఉంది. ఆ రాష్ట్రానికి ఆనుకుని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఉండడంతో ఒకింత అప్రమత్తంగా వ్యవహరించాల్సివుంది. కోనసీమ జిల్లాలో కూడా ఒక కేసు నమోదైందన్న వార్త గురువారం ఉదయం నుంచే సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈనేపథ్యంలో ప్రజలు కరోనా నివారణా చర్యలు పాటించాలని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలి



దేశంలో కొత్త వేరియంట్ కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మాస్కులు ధరించడంతోపాటు భౌతిక దూరం పాటించడం మేలు. పిహెచ్‌సిల పరిధిలో రోజుకు ముగ్గురికి చొప్పున కరోనా పరీక్షలు రెండు రోజులపాటు నిర్వహించాం. ప్రస్తుతానికి ప్రజలంతా క్షేమంగానే ఉన్నారు. కానీ, జనం అప్రమత్తంగా ఉండాలి. అసలే శీతాకాలం. ఈ సీజన్‌లో వైరస్ వ్యాప్తిచెందడానికి ఎంతో అనువుగా ఉంటుంది. వీలైనంత వరకు శానిటైజర్లు ఉపయోగంచడం మంచిది.

-ఎస్‌వి రమణకుమారి,
జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, డెంకాడ, రేగిడి



నాతవలస కూడలిలో చంద్రబాబుకు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

నాతవలస టు రాజాం రోడ్‌షో
బాబుకు బ్రహ్మారథం

ఘనస్వాగతం పలికిన టిడిపి శ్రేణులు

జిల్లా పర్యటనకు విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు డెంకాడ మండలం నాతవలస టోల్‌గేటు వద్ద ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం 3.45గంటలకు విశాఖ నుంచి రోడ్డుమార్గంలో రాజాం పర్యటనకు వెళ్తున్న ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, భారీ గజమాల, పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఎచ్చెర్ల, రణస్థలం, చిలకపాలెం, లోలుగు, రాపాక, పొగిరి, పొందూరు జంక్షన్ ల మీదుగా చంద్రబాబు రోడ్ షో సాగింది. బాబుకు డప్పుల దరువులు, తప్పెటగుళ్లు, పార్టీ జెండా లతో స్వాగతం లభించింది. రోడ్‌షో కు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు చంద్రబాబు చేతులు జోడించి అభివాదం తెలిపారు. తెలుగు తమ్ముళ్ల హడావుడితో రోడ్ షో మొత్తం పండగ వాతావరణం నెలకొంది. రహదారి పొడవునా జనం బారులు తీరారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, లొలుగు, పొందూరు జంక్షన్లలో ఘన స్వాగతం పలికారు. పొగిరి నుంచి రాజాం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. నాతవలస వద్ద స్వాగతం పలికిన వారిలో టిడిపి నాయకులు పి.అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, పతివాడ నారాయణస్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, మీసాల గీత, కెఎ నాయుడు, ఆర్‌పి భంజ్‌దేవ్, నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజు, పతివాడ అప్పలనారాయణ, సువ్వాడ రవిశేఖర్, పతివాడ వెంకట శివరామ విద్యాసాగర్ నాయుడు, పతివాడ అప్పలనాయుడు పతివాడ తమ్మునాయుడు, పాణిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశాడు

సిఎం జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసిపి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పొందూరు, రాజాంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డబ్బుతో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం దుర్మార్గమని అన్నారు. సీతారాంకు స్పీకర్‌గా కొనసాగే అర్హత లేదన్నారు. చెతపై పన్ను వేసిన. చెత్త ముఖ్య మంత్రి జగన్ అని, ఎన్నికలు ముందుగా వచ్చినా సిద్ధమేనన్నారు. రాష్ట్రంలో ఒక్కటంటే పరిశ్రమ గానీ, విద్యాసంస్థలు గాని తెచ్చుకోలేని అసమర్థ ముఖ్యమంత్రి అని దుయ్యబట్టారు. పొందూరు ఖద్దరు తయారీ కార్మికులను, చేనేత కార్మికులను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అచ్చెన్నాయుడును అరెస్టు చేసి, రవి కుమార్ పై కేసులు పెట్టి ఏం పీకారని అన్నారు. చదువుకున్న యువకులు ఉద్యోగాల కోసం తన వైపు చూస్తున్నారని, జాబ్ కావాలంటే బాబు రావాలని అన్నారు. రాజాం పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు వేసి అభివృద్ధి చేస్తానన్నారు.

కిక్కిరిసన రాజాం

రాజాంలోని బహిరంగ సభకు వచ్చిన టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు తెలుగు తమ్ముళ్ల బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన తెలుగు తమ్ముళ్లతో రాజాం పట్టణ ప్రధాన రహదారి కిక్కిరిసింది. బాణసంచా, డప్పుల దరువులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండ్రు మురళీ, నాయకులు గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

ఐవిపి రాజుకు చంద్రబాబు పలకరింపు

ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజును చంద్రబాబు పలుకరించారు. నాతవలసలో స్వాగతం పలికేందుకు వెళ్లిన ఆయనను చంద్ర బాబు పిలిచి ఆలింగనం చేసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.



అగ్నిప్రమాదంలో దగ్ధమైపోతున్న వరికుప్పలు

సూడిగాంలో భారీ అగ్నిప్రమాదం

ధాన్యం, వరికుప్పలు దగ్ధం

పార్వతీపురంరూరల్ :మండలంలోని సూడిగాంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో వంద ధాన్యం బస్తాలు, నాలుగు ధాన్యం కుప్పలు దగ్ధమై భారీ ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన ధమలపాటి అప్పలనాయుడు కళ్లాంలో నూర్పుడి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న వంద ధాన్యం బస్తాలతో పాటు అతనికి చెందిన నాలుగు నూర్పిడి చేయాల్సిన ధాన్యం కుప్పలు కూడా కాలిపోవడంతో ఆర్థికంగా నష్టం జరిగింది. ఏడాది కష్టపడి పండించిన పంట కళ్లముందే దగ్ధమైపోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో బోల్తా

- విద్యార్థులకు తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని సోమలింగాపురం, పాలెం గ్రామాల మధ్య ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మెరక ముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు గురువారం సాయంత్రం పాఠశాల విడిచి పెట్టిన తరువాత మెరక ముడిదాం నుండి పాలెం గ్రామానికి ఆటోలో వెళ్తుండగా బోల్తాపడింది. దీంతో యు. దినేష్, ఆర్. రేవంత్, జి. జగన్, జి దిక్షిత, పి. ఇందుకు తీవ్ర గాయాలు అవ్వడంతో వెంటనే 108వాహనం ద్వారా చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడనుండి వీరిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అయితే వీరిలో దినేష్, రేవంత్, జగన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పక్కాగా శంబర ఉత్సవ ఏర్పాట్లు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -కలెక్టరేట్

శంబర ఉత్సవ ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారి కె.హేమలత అన్నారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 23 నుంచి 25 వరకూ మక్కువ మండలం శంబరలో పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు జరుగుతాయన్నారు. మారు జాతర జనవరి 31 జరుగుతుందన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో వచ్చే భక్తులకు తాగునీరు, చంటి పిల్లలకు పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. గుడి ఎదురుగా ఉన్న కాలువను మరమ్మతులు చేసి, దానిపై పలకలు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు శుభ్రపర్చి, బ్లీచింగ్ వేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశించారు. లైటింగ్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు దేవాదాయశాఖ నుంచి రూ.30వేల డిడిని విద్యుత్ శాఖకు చెల్లించాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశించారు. 5 కెవి సామర్థ్యం గల 5 జనరేటర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. రెండు జనరేటర్లు చదురుగుడి వద్ద, ఒకటి వనం గుడి వద్ద, ఒకటి బస్ స్టాప్ వద్ద, ఒకటి హై స్కూల్ వద్ద ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ దీపాలు, సీరియల్ సెట్లును ఉత్సవాల్లో ఏర్పాటు చేసి వేడుకల వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. రహదార్లు, భవనాల శాఖ అధికారులు రథానికి ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను కమిటీ సభ్యులకు ఇవ్వాలని, జాతరలో రథం లాగే వారికి గుర్తింపు కోసం టీ-షర్టులు ఇవ్వాలని దేవాదాయశాఖకు ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. పార్వతీపురం, సాలూరు అగ్నిమాపక కేంద్రాల నుంచి అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారులకు సూచించారు. సిరిమానోత్సవానికి వాహనాన్ని స్థానికంగా ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఆర్‌టిసి బస్సులను నిరంతరాయంగా నడపాలని డిపో మేనేజర్‌కు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు. సమావేశంలో డిఎస్‌పి ఎ.సుభాష్, జిల్లా దేవాదాయశాఖ అధికారి కె.ఎల్.సుధారాణి, శంబర ఉత్సవ కమిటీ ఛైర్మన్ పి.దాలినాయుడు, ఇఒ వి.రాధాకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ వివరాలు తెలుపుతున్న ఇఒ రాధాకృష్ణ, పక్కన ఆర్‌డిఒ హేమలత

ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాదారులకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాదారులకు రుణాల మంజూరు కోసం బ్యాంకులకు స్పష్టమైన నిబంధనలు ఇవ్వాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజనులకు ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలను జారీ చేశామని, అయితే బ్యాంకు రుణాలు అందక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నెలలో మూడు వందల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని, హైరిస్క్ కేసులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం జవహర్‌రెడ్డి మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణీ కేసులను వారం ముందుగానే ఆసుపత్రిలో చేర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ ఫ్లై కోసం రెవెన్యూ అధికారుల సేవలు వినియోగించుకోవాలి

భూముల రీ సర్వేలో డ్రోన్ ఫ్లై కోసం గ్రామ రెవెన్యూఅధికారుల సేవలు వినియోగించుకోవాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయి ప్రసాద్ అన్నారు. రీసర్వేపై గురువారం జిల్లా కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో సిసిఎల్ఎ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లై త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 158 గ్రామాల్లో పెండింగ్ ఉందని, త్వరగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రోజుకు వెయ్యి ఎకరాలు చొప్పున డ్రోన్ ఫ్లై జరుగుతుందన్నారు. జనవరి 17 నాటికి 70 శాతం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, కలెక్టర్ కార్యాలయ విభాగాల పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, జ్ఞానవేణి, సర్వే ఇన్స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న జిల్లా అధికారులు, రెవెన్యూ సంఘాల నాయకులు

కలెక్టర్‌ను అభినందించిన అధికారులు

కలెక్టరేట్ : సంయుక్త కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందిన కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా అధికారుల సంఘం, రెవెన్యూ సంఘం గురువారం ఘనంగా అభినందనలు తెలిపింది. ఈ మేరకు సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అందరి అభిమానాలతో మంచి సేవలు అందించుటకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు, హౌసింగ్, డ్వామా పీడీలు పి.రఘురాం, కె.రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పశుసంవర్ధక జెడి ఇ.ఈశ్వరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎస్.డి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డిఎంహెచ్ఒకు సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు

సిహెచ్‌డబ్ల్యులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర అన్నారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అర్హులను ఆశాలుగా గుర్తించాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, పాత, కొత్త జీతాలు సంక్రాంతి నాటికి ఇచ్చేలా చూడాలని కోరారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒకు వినతిని అందజేశారు. దీనికి ఆమె స్పందిస్తూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పాత బకాయి జీతాలు బిల్లులు పెట్టామని తెలిపారు. ధర్నాలో సిఐటియు జిల్లా కోశాధికారి జివి రమణ, పలువురు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.


ధాన్యం రైతులను ఆదుకోవాలి
తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి, రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ రైతులు ధాన్యం తయారు చేసి వారం రోజులవుతున్నా అమ్ముకోలేని పరిస్థితి మండలంలో ఉందన్నారు. శిఖబడికి చెందిన ఎర్ర సత్యనారాయణ అనే రైతు వారం రోజులుగా నూర్పు చేసి కళ్లంలో ధాన్యం నిల్వ ఉంచినప్పటికీ లారీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రవాణా సౌకర్యం రైతుల సమకూర్చుకోవాలని అధికారులు చెప్పడంతో లారీల రాక ధాన్యాన్ని కళ్లాలోనే ఉన్నాయన్నారు. ఇలా ఒక్క మండలంలోని కాకుండా జిల్లా మొత్తం అధికారులు రవాణా సౌకర్యాలు రైతుల సమకూర్చుకోవాలని చెప్పారు. వాహనం వచ్చి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఫోటో తీసిన తర్వాత మాత్రమే ట్రక్ సీటు జనరేట్ అవ్వడంతో రైతుల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల రైతులు ప్రైవేట్ దళారులకు 84 కేజీల ధాన్యం బస్తా కేవలం రూ.1400 అమ్ముకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయన్నారు. వెంటనే వీటిని జిల్లా అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే వాహనాలు అధికారులు సమకూర్చాలని, అది కూడా ప్రభుత్వమే నేరుగా వాహనదారులకు అద్దె చెల్లించాలని, రైతుతో ముడిపెట్టడం వల్ల రైతుల ఆందోళన కు గురవుతున్నారని అన్నారు. జాంబ్లింగ్ విధానం వల్ల బస్తా ధాన్యానికి వంద నుంచి 200 రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కావున వెంటనే జంబ్లిగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు సరిపడా గోనె సంచి తెప్పించి రవాణా సౌకర్యం కల్పించి, తూకంలో మోసాలను అరికట్టాని కోరారు. ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, దంగభద్ర సర్పంచ్ జోగి భుజంగనాయుడు, జోగుల దుమ్మా, మాజీ సర్పంచ్ సివ్వాల తవిటినాయుడు, రైతు సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, బడే జోగి నాయుడు, రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు



మిల్లర్లతో చర్చిస్తున్న యూనియన్ నాయకులు

వేతన ఒప్పందం ఖరారు

ముగిసిన రైస్ మిల్ కళాసీల సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం రైస్ మిల్లు కళాసీల సంఘం (సిఐటియు) వారికి, రైస్ మిల్లు యజమానులకు మధ్య ప్రతి మూడేళ్లకొకసారి జరుగుతున్న పిసి రేట్ వేతన ఒప్పందం అంగీకారం జరిగింది. ఇప్పుడు ఉన్న రేట్లుకు 18 శాతం పెంపునకు అంగీకారం జరిగిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అన్నారు. మే 22 నాటికి మూడేళ్ల ఒప్పంద సమయం ముగిసిందని, మళ్లీ కొత్త వేతన ఒప్పందం చేయాల్సి ఉన్నా ఏడునెలలు కావస్తున్నా ఇంత వరకూ చేయలేదన్నారు. పలుదఫాలుగా ఎసిఎల్, డిఎస్ఒ తదితర అధికారుల దగ్గర చర్చలు జరిగిన తర్వాత రైస్ మిల్ యజమానులు 18 శాతం పెంపుదలకు అంగీకరించారని అన్నారు. ఇందుకోసం రైస్ మిల్లు కార్మికులు సమ్మె విరమింప చేసి పనులకు వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లు యూనియన్ ప్రెసిడెంట్ జి.కృష్ణ, ఆదినారాయణ, పి.శంకర్, తేలి సత్యం, ఎం.త్రినాథ్, కె.జగ్గారావు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, గొర్లె వెంకటరమణ, అధ్యక్షులు డి.రమణారావు, వి.ఇందిర, రైస్ మిల్ యజమానులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పార్వతీపురం టౌన్ : క్రీస్తు బోధనలు అనుసరణీయమని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక స్థానిక లయన్స్ క్లబ్ లో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలతో మానవత్వం పరిమళిస్తుందన్నారు. మంచి సంకల్పం చేసుకోవాలని తద్వారా మంచి జరుగుతోందని వివరించారు. ఉన్నత లక్ష్యాలను కలిగిన మానవ సంబంధాలను సమాజంలో నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ క్రీస్తు ఆలోచనా విధానం అనుసరించాలన్నారు. సమాజానికి ఉపయోగకరంగా ఉండేలా మనల్ని తీర్చిదిద్దాలని క్రీస్తు కోరుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి మాట్లాడుతూ అందరూ సుఖసంతోషాలతో ఉండాలని క్రీస్తు బోధలు అనుసరణీయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి. చంద్ర శేఖర్, సిపిఒ పి.వీర్రాజు, డిటిఒ ఒ.శశి కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి కె.సీతారాం, డిఐఒ లోచర్ల రమేష్, డిపిఒ టి.సత్యనారాయణ, జిల్లా ఖజానా అధికారి ఎ. మన్మధ రావు, పాస్టర్లు తిమోతి, సూర్య ప్రకాష్, విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

ప్రజలకు సాయం చేసేలా పని చేయాలి

వీరఘట్టం : రాజకీయం చేసే ప్రజలకు సహాయం చేసే విధంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కార్యకర్తలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గౌడ, వడ్డీ, బీసీ కాలనీ, రెల్లి, పెరుగు తదితర వీధుల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి ఆశలు నెరవేర్చేందుకు మనం పని చేయాలన్నారు. అప్పుడే ప్రజల్లో మనపై విశ్వాసం పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల్లో ఎటువంటి సమస్యలను సత్వరమే సమస్య పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. గౌరమ్మ, ఎంపిడిఒ డి. వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, లలిత కుమారి, భోగి లత, మాణిక్యం, చంద్రశేఖర్, బి. లక్ష్మీనారాయణ, అంజనేయులు, ఎం. హేమలత, ఎస్ శ్రీనివాసరావు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు : పామాయిల్ గెలలు కొట్టే కూలీల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహా కార్యదర్శి మజ్జి శ్రీనివాస రావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు తామరాపు తిరుపతి రావు కోరారు. మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పామాయిల్ గెలలు కొట్టే కూలీల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సాలూరు, మక్కువ, పాచిపెంట, కొమరాడ, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో పామాయిల్ తోటలో గెలలు కొట్టే కూలీలు ఎక్కువగా ఉన్నారన్నారు. ఈ పనులు చేసే సమయంలో పాములు, జెర్రులు ప్రాణాపాయంగా పరిగణిస్తున్న వారు ప్రాణాలు పోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వీరి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రేషన్ సమస్యలపై నిరసన

పాచిపెంట : గిరిజన పంచాయతీల్లోని రేషన్‌పోల్ల్లో సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు గెమ్మెల రామయ్య, గిరిజన సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పవాల తమ్మయ్య, సిటిదియ నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గురువారం పాచిపెంటలో గిరిజన సంఘం, ఆదివాసీల ఐక్యవేదిక, సిటిదియ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడంగు పంచాయతీ కేసరి పంచాయతీలో దాదాపు 22 గిరిజన గ్రామాల నుండి మడపలన వచ్చి రేషన్ తీసుకోవాలంటే జిసిసి డిపోల ద్వారా ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.400 వరకు ఖర్చవుతుందన్నారు. కావున తక్షణమే సడిపో కుంతాం వద్ద ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మడపలన గడపగడపకు వైసిపి ప్రభుత్వంలోగా ఉప ముఖ్యమంత్రికి ఈ విషయం తెలిపినా నేటికీ ఈ పద్ధతి మార్చలేదని అన్నారు. బయోమెట్రిక్ సమస్య తీవ్రంగా ఉండడం వల్ల ఒక్కొక్కసారి కష్టపడి వచ్చినా ఫలితం ఉండటం లేదని, ఆఫ్‌లైన్ ద్వారా రేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. తక్షణమే కుంతాంలో సబ్ డిపో ఏర్పాటు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

భామిని : మండలంలో అధిక శాతం మంది పత్తి పంటను పండిస్తున్నారని మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే రూ.10వేలు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా పత్తి రైతులను మోసం చేస్తూ సిసి ధర రూ.6500 లోపే ధర చూపిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ పరి పండించిన రైతన్నల ధాన్యం కళ్లలో ముగ్గుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ జి.జగన్, నాయకులు కె. మిన్నారావు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు బహిరంగ సభ

సీతానగరం : బొబ్బిలిలో జరగున్న టిడిపి ఇదేంఖర్మ రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆరు వేణుగోపాలనాయుడు కోరారు. ఈ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏకలవ్య విద్యార్థులకు స్వర్ణపతకం

మక్కువ : జాతీయ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణ పతకం తెచ్చిపెట్టిన టీమ్‌లో అనసభద్ర ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఉండడం గర్వంగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ ఎల్ నాయుడు అన్నారు. 12 మంది జట్టులో ఆరుగురు ఏకలవ్య విద్యార్థులు విజయానికి దోహదపడ్డారన్నారు. అన్ని రంగాలలో విద్యార్థులు నైపుణ్యం సాధించి పాఠశాలకు మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు.

తోటపల్లి ఆధునీకరణ పనులు పునఃప్రారంభం

పాలకొండ : తోటపల్లి ఆధునీకరణ పనులు పునఃప్రారంభిస్తున్నట్లు ఇరిగేషన్ డిఇఇ డి.రవికుమార్ అన్నారు. ఎడమ ప్రధాన కాలువ నంద హాస్పేసుపురం వద్ద ఈ పనులు మరలా ప్రారంభించడం జరుగుతుందన్నారు.

రైల్వే మూడోలైన్ బాధితులకు న్యాయం చేయండి

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో న్న కొత్తవలస రైల్వే మూడోలైన్ బాధితులకు న్యాయం చేయాలని పార్వతీపురం జనసేన డివిజన్ అధికారి కె.హేమలతను జనసేన నాయకులు కోరారు. గురువారం జనసేన నాయకులు అనిల్ కుమార్, కరుణ, దాలి నాయుడు, రాజాన రాంబాబు తదితరులు ఆర్‌డిఒను కలిసి పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన రైల్వే మూడో లైను ఏర్పాటులో ఇళ్ళు కోల్పోయిన బాధితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులంతా పేద, దినసరి కూలీలని, ప్రభుత్వపరంగా వారికి న్యాయం చేయాలని కోరారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలతో పాటు రైల్వే లైను కోసం తీసుకుంటున్న ఇంటి స్థలానికి ప్రస్తుత ధర ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి సంబంధించిన మొత్తాన్ని కూడా చెల్లించాలన్నారు. వారికి కొత్తగా స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేసే అక్కడ నిర్మాణాలు చేసుకునేవరకూ ఇళ్లను ఖాళీ చేస్తారని తెలిపారు. దీనిపై ఆర్డీవో హేమలత మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము బాధితులకు న్యాయం చేస్తామని, వారు కోరిన మొత్తాన్ని దగ్గరలో ఇప్పించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

వైఎస్సార్ బీమా సహాయం అందజేత

కురుపాం : మండలంలోని మొండెఖల్ పంచాయతీలో గల గాంధీ నగర్ గ్రామానికి చెందిన ఆరిక మంగి మరణించినందున ఆమె నామిని అయినటువంటి భర్త లక్ష్మయకి గురువారం సచివాలయం వద్ద సర్పంచ్ ఐ.గౌరీ శంకర్ వైయస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన దొంగతనం కేసులో ముద్దాయిలైన చెరుకుబిల్లి కిషోర్, చెరుకుబిల్లి నవీన్‌పై నేరం రుజువైనందున గురువారం స్థానిక జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఐ.ఆంజనేయులు ముద్దాయిలు ఇద్దరికి నాలుగేళ్లు జైలు, ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టనిచో ఒక్కొక్కరికి 12 నెలలు జైలు శిక్ష విధించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి చంద్రకుమార్ వాదించారు.

ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను స్థానిక కస్తూరిబా పాఠశాలలో గురువారం నిర్వహించారు. విద్యార్థుల భాగస్వామ్యంతో రామానుజన్ సంఖ్య 1729 ఆకృతిలో విద్యార్థులు కూర్చొని సంఖ్యా ప్రాముఖ్యత వివరించారు. పదవ తరగతి విద్యార్థులు తయారు చేసిన గణితం ప్రాజెక్టు గురించి తోటి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ రంజని పాల్గొన్నారు.

మూలిగూడ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాన్ని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సామల సింహాచలం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల హెచ్ ఎం స్వయంగా వేసిన శ్రీనివాస రామానుజన్ చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, గణిత ఉపాధ్యాయులు రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ఈ సందర్భంగా వేసిన వేశధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ జి. బాబురావు, ఉపాధ్యాయులు శ్రీను, దిలీప్, శివరాం ప్రసాద్, సూరి బాబు, రామునాయుడు, అశోక్ కుమార్, ముత్యాల రావు, పాల్గొన్నారు.

కొమరాడ :మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో ఘనంగా శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు ప్రిన్సిపాల్ రజనికుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పార్వతీపురం రూరల్ : గణిత మేధావి దేశానికి చెందిన శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని నర్సిపురం ఎమ్మార్ నగరం పెద్దబొండపల్లి, ములగ, బందలుప్పి, పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని నిడగలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మరడాన శివుని నాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాస్ జయంతి వేడుకలు నిర్వహించారు.


సాలూరు: విజేతకు బహుమతిని అందిస్తున్న కమిషనర్ శంకరరావు

పాలకొండ రూరల్ : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ బాలికలు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీనివాస్ రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, విజయగౌరి, రోహిణి, లత, కృష్ణవేణి తదితరులున్నారు.

శాఖా గ్రంథాలయంలో....

స్థానిక శాఖాగ్రంథాలయంలో గణిత మేధావి రామానుజన్ అయ్యంగార్ చిత్రపటానికి ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బారు గణేష్‌బాబు పూలమాలేసి నివాళులర్పించారు.

సాలూరు : స్థానిక రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఎంఇఒ బి.రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, ప్రముఖ న్యాయవాది రేగు మహేష్ బహుమతులు ప్రదానం చేశారు. గత 22ఏళ్లుగా రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రంభ రజనీకాంత్ సొంత ఖర్చుతో ప్రతి ఏటా గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం డిసెంబర్ 22న విజేతలకు బహుమతులు అందజేస్తారు. పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో చదివితే అనుకున్న లక్ష్యానికి చేరుకోవడం సులువవుతుందన్నారు. న్యాయవాది రేగు మహేష్ మాట్లాడుతూ వెనుకబడిన నియోజకవర్గం లో విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల ఆసక్తి పెంచడానికి ఏటా సొంత డబ్బుతో మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు రంభ రజనీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో గణితం పట్ల నెలకొన్న భయాందోళనలు పారదోలడానికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొల్లి గిరిబాబు, కెవి సత్యనారాయణ, గౌరీ శంకర్, సంతోష్, ప్రసాద్ పాల్గొన్నారు.

కురుపాం : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల వద్ద ప్రిన్సిపల్ గణపతిరావు ఆధ్వర్యంలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.తిరుపతిరావు, సీతంపేట ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.గౌరీశంకర్రావు, సరస్వతి విద్యానికేతన్ ప్రిన్సిపల్ సంతోష్ కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా పలు పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెదమేరంగి శ్రీ సత్య కైలాస్ పాఠశాల తిరుమల సాయి విద్యానికేతన్, రావాడ రామభద్రపురం, బిజెపి పురం, పెదమేరంగి, చినమేరంగి, టికె జమ్ము, జియమ్మవలస ప్రాథమికోన్నత పాఠశాలల్లో రామానుజన్ జయంతి ఉత్సవాలను నిర్వహించుకున్నారు. రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు రుగడ శ్రీనివాసరావు ఈ సందర్భంగా శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటాన్ని పాఠశాల గోడలపై గీశారు. పాఠశాలలో విద్యార్థులకు చిత్రపటంపై పోటీలు నిర్వహించి బహుమతులను కూడా అందజేశారు. రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడుతూ విద్యార్థులు కూడా గణిత శాస్త్రంలో నిపుణత సాధించుకోవడానికి కృషి చేయాలని కోరారు

వ్యవసాయశాఖపై గరం గరం

ప్రజాశక్తి - కురుపాం


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

వ్యవసాయ అధికారి పనితీరుపై మండల సర్వసభ సమావేశంలో సభ్యులు తీవ్ర ధ్వజమెత్తారు. స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద మండల పరిషత్ సర్వసాధారణ సమావేశం ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో జరిగే కార్యక్రమాలు ప్రజాప్రతినిధులకు తెలియజే యాల్సిన బాధ్యత వ్యవసాయాధికారికి లేదానని ప్రశ్నించారు. మొండిఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్ మాట్లాడుతూ తమ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి నప్పటికీ కనీస సమాచారం ఇవ్వలేదని, సర్పంచికే కనీస సమాచారం లేకపోతే సామాన్యులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గుమ్మడిగూడ సర్పంచ్ శెట్టి సురేష్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారి గ్రామంలో రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు, టార్పన్ల డేటా తీసుకొని ఎవరికి ఎన్ని అవసరమో కనీసం సమాచారం తీసుకోవడం లేదని, దీనివల్ల రైతులకు వ్యవసాయ శాఖలో సేవలందనంత దూరంలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపిపి అన్నాజీరావు, సర్పంచ్ గౌరీశంకర్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సేవలు దారుణంగా ఉన్నాయని మొండఖల్, నీలకంఠాపురం పిహెచ్‌సిల్లో ఇద్దరు వైద్యాధికారులుంటే ఒక్కొక్క వైద్యాధికారి మూడు రోజులు చొప్పున విధి నిర్వహిస్తూ సకాలంలో రోగులకు అందుబాటులో ఉండడంలేదని అన్నారు. జనరల్‌బాడీ సమావేశానికి వారు రాకుండా కింద స్థాయి సిబ్బందిని పంపించడం ఎంతవరకు సమంజసమని డిఎంహెచ్‌ఒకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మథరావు మాట్లాడుతూ నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన భవన నిర్మాణం పూర్తయిందని అది ప్రారంభించ కపోవడం వల్ల 300 మంది గిరిజన విద్యార్థులు ఇరుకు గదుల్లో ఉండి ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఈ భవనం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎటిడబ్ల్యుఒ చంద్రబాబును కోరారు. వైస్ ఎంపిపి రంగారావు మాట్లాడుతూ ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు గేటు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఎవరైనా వెళ్లొచ్చని, గత నాలుగు సాధారణ సమావేశాల్లో ఈ సమస్యపై ప్రస్తావించినా అధికారులు పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటని ఎటిడబ్ల్యుఒ చంద్రబాబును నిలదీశారు. అనంతరం ఎటిడబ్ల్యుఒ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ నిధుల ద్వారా గేటును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ వ్యవసాయ అధికారి మండలంలో వరిసాగు ఎంత, ఎవరికి ఎన్ని గోనె సంచులు అవసరమో ఆర్‌బికెల ద్వారా రైతులకు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కానీ కనీసం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ప్రారంభించారో ఎప్పుడు ప్రారంభించారు ప్రజాప్రతినిధులు కూడా తెలియజేయ కపోవడం సమంజసం కాదని ఇకనైనా వ్యవసాయ అధికారి పని తీరు మార్చుకొని రైతులకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ వివి శివరామప్ప, ఉపతహశీల్దార్ నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, పలువురు ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

కురుపాం : రైతులు దగ్గర నుండి ధాన్యం కొనుగోలు పై మిల్లర్ల దోపిడీని తక్షణమే ప్రభుత్వం స్పందించి అరికట్టాలని టిడిపి అరుకు పార్లమెంట్ బిసిసెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామ రైతులు చేస్తున్న మిల్లర్ల దోపిడీపై నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అధికారులు 40 కేజీల 180 గ్రాములు తునిక వేయమని ఒకపక్క చెప్తుంటే మరో పక్క 42 కేజీలు బస్తా ఉంటేనే మిల్లులో దించుతామని లేదంటే ధాన్యాన్ని మిల్లులో దించమని యాజమాన్యం చెబుతున్నారని అన్నారు. రైతు దగ్గర డబ్బులు లేకపోవడంతో రవాణా చార్జీలు హమాలీల చార్జీలు ఇవ్వలేకపోతున్నారని ప్రభుత్వం వెంటనే రవాణా చార్జీలు ఇప్పించి దోపిడీ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్కు పంపిణీ

పాలకొండ రూరల్ : మండలంలో ఓని గ్రామంలో కనపాక పవన్‌కుమార్ ఇటీవలే మృతి చెందడంతో ఆయన భార్య కనపాక లక్ష్మీకి గురువారం ప్రభుత్వ సాయం కింద రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డొంక త్రినాధులు మాట్లాడుతూ వైఎస్ఆర్ భీమా పథకం పేదలకు వరం వంటిదన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనపాక లక్ష్మీ తదితరులున్నారు.

వృద్ధులకు బట్టల పంపిణీ


వీరఘట్టం : మండలం పరిధిలోనే కత్తుల కవిటి గ్రామంలో గురువారం రౌతు విశ్వేశ్వర రావు జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యులు వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగంపేట, గడపవలస, వంకాయల గడ్డ, బల్ల గుడ్డ, కే ఇచ్చాపురం తదితర గ్రామాల ప్రజలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్య, శృతి, జ్యోత్స్న, డి. సంధ్యారాణి, నిఖిల, శ్రీ నీలేష్, సాయి, జంపు ఉమామహేశ్వర రావు, గేదెల సుదర్శన్ రావు, ద్రరు సత్యం పాల్గొన్నారు.

పార్టీ నుంచి సంగం తొలగింపు

పార్వతీపురం టౌన్ : పెనుగుర్తి సంగంను తమ పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు సిపిఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, కమిటీ సభ్యులు బిడ్డిక ఆదినారాయణ, నిమ్మక సూరన్న తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంగంను పార్టీ నుంచి తొలగించినప్పటికీ జిల్లా కమిటీకి సంబంధం లేని కార్యకలాపాలు చేస్తున్నందున పార్టీ నుంచి తొలగించినట్టు తెలిపారు.

ఆధునిక పరికరాలతో మెరుగైన బోధన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్


పార్వతీపురం: ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ ద్వారా ఆధునికమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం ఎమ్ఆర్ నగరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని పలు సంక్షేమ పథకాలతో పాటు ఆధునిక పరికరాలు అందించే ప్రభుత్వం తమదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, ఎంఇఒ ప్రసాద్ రావు, హెచ్‌ఎం మధుసూదన్ రావు, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, స్థానిక సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉపసర్పంచ్ త్రినాధ నాయుడు, ఎంపిటిసి బడే రామారావులతోపాటు నాయకులు బొమ్మ రమేష్, బలగ నాగేశ్వరరావు మజ్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌గా అవతారమెత్తిన డిఇఒ

కొమరాడ : ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మెరుగైన విద్యా బోధనలు అందించే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ అన్నారు. గురువారం మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో ఉన్న ఎపియుపి స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో డిఇఒ టీచర్ అవతారమెత్తారు. అనంతరం స్కూల్లో జరిగిన గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు చేపట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకం సంబంధించి భోజనాన్ని పరిశీలించారు. పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎంతో నమ్మకం పైన పిల్లలను చదివిస్తున్నారని తల్లిదండ్రులకు ఆ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాధ్యతగా ఉపాధ్యాయులు వ్యవహరించాలని కోరారు

కొమరాడ : సమాజం అభివృద్ధితోపాటు విద్యా బోధనలు మెరుగుపడాలని ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని కోటిపాము జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12 పాఠశాలలకు 442 ట్యాబ్‌లు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో భాగంగా కొమరాడ కోటిపాం, విక్రమపురం, గుణాపురం పాఠశాలలలో 182 ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పాఠశాలకు త్వరలో పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకొని ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు, సర్పంచ్ సుగుణ, ఎంపిటిసి పార్వతి, వైస్ ఎంపిపి ఎం. శరత్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన నాయుడు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులు చెరువు కబ్జా

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కన్నప్పదొరవలసలో చందాన చెరువులోను రియల్ ఎస్టేట్ కోసం అధికార వైసిపి నాయకులు చెరువను కబ్జా చేస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన గ్రామ వైస్ సర్పంచ్ పూడి కుమార్ పూతికవలస సెంటర్ వద్ద వేస్తున్న రియల్ ఎస్టేట్ కోసం అక్రమంగా కొన్ని వందల లోడ్లు జెసిబితో తవ్వించి మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, మండల కార్యదర్శి కె సీతారాం ఈ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందాన చెరువును రియల్ ఎస్టేట్ కోసం అక్రమంగా తవ్వారని, కొన్ని వందల లోడ్లు అధికార పార్టీ నాయకులు మట్టిని తరలించుకుపోతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. చెరువులను పరిరక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. చందాన చెరువులో మట్టి తవ్వుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత హడావిడిగా అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారన్నారు.


అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్


ఆక్రమణకు గురవుతున్న చెరువును చూపిస్తున్న నాయకులు

ఈ వార్తను ప్రచురించిన ఓ విలేకరిపై కన్నపుదొరవలస వైస్ సర్పంచ్ పూడి కుమార్, పూడి భూషణరావు దాడికి ప్రయత్నించగా, సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. చందాన చెరువులో అక్రమంగా మట్టి తవ్విన వారిపైనా తీసుకోవాలని, విలేఖరిపై దౌర్జన్యానికి పాల్పడిన వైస్ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి అని సిపిఎం నాయుకులు డిమాండ్ చేశారు.

అదనంగా తీసుకుంటే చెప్పండి: సబ్ కలెక్టర్

వీరఘట్టం : ధాన్యం కొలతల్లో అదనంగా ధాన్యం తీసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని పాలకొండ సభ కలెక్టర్ నూరల్ కమర్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని నడిమికెళ్ల రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. 80 కేజీల 180 గ్రాములు కంటే అదనంగా ధాన్యం తూనికలు వేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. ఎంతమంది రైతులు ధాన్యం సిద్ధం చేశారు? ఇంక ఎంతమంది ధాన్యం సిద్ధం చేయవలసి ఉందని సిబ్బందిని ప్రశ్నించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు ధాన్యం విక్రయాలు జరిపి శ్రమకు తగ్గ ఫలితాన్ని పొందాలని రైతులను కోరారు. వండువ గ్రామంలోనే రైతులతో మాట్లాడుతూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


పాలకొండ: సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న గౌసుజుద్దీన్

పాలకొండ : స్థానిక ప్రభుత్వ బిసి బాలురు వసతి గృహంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గురువారం జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారిత అధికారి మహ్మద్ గౌసుజుద్దీన్ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి చర్చించారు. శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ సమస్య పరిష్కారానికి త్వరలో కృషి చేస్తానన్నారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును కలిసి ఈ సమస్యపై మాట్లాడారు. అనంతరం వసతి గృహాధికారులతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, విద్యాప్రమాణాలు మెరుగుపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకులు టివిఎం గోపినాథ్, వసతిగృహాధికారులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మూడున్నర ఏళ్ళ పాలనలో గిరిజన సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. మండలంలోని కుక్కిడి పంచాయితీ బుషిని కాలనీ, నోంద్రుకోన పంచాయతీ కీసరగూడ గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నేటి వరకు పక్కా గృహాలు మంజూరు చేయలేదని శిథిలమైన ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గిరిజనుల ఉపాధి కోసం గత ప్రభుత్వాలు ఐటిడిఎ ద్వారా ట్రెయికర్ రుణాలు అందిస్తే ఈ ప్రభుత్వం వాటిని నిలుపుదల చేసిందని అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. నిత్యావసర ధరలు పెరుగుదలతో గిరిజనుల జీవనం కష్టంగా మారిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చెక్ డ్యామ్‌లు, మినీ రిజర్వాయర్లను అభివృద్ధి పరచకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. కీసరగూడ గ్రామానికి రహదారి సౌకర్యం లేదని గిరిజనులు తెలిపారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన ప్రజా ప్రతినిధులు ఇంతవరకు కనిపించలేదని అన్నారు. గిరిజనుల కష్టాలు తీరాలంటే టిడిపి 2024 ఎన్నికల్లో అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక సుధ, బిడ్డిక కొండలరావు ఉన్నారు

చెరకు రైతులకు తీవ్ర ద్రోహం

కొమరాడ : జిల్లా చెరుకు రైతులకు ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఎంసిఎ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని చెరుకు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ గోడ పత్రికలు గురువారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ ఉపేంద్ర మాట్లాడుతూ గత ఉమ్మడి విజయనగరం జిల్లాలో చెరుకు రైతులకు ఎంతో అందుబాటులో ఉండే ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని అమ్మేయడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉండేటప్పుడు ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తానని పాదయాత్ర సందర్భంగా చెప్పి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నా జగన్మోహన్‌రెడ్డి నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పోరాడుతున్న రైతులు, ప్రజా సంఘాల నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవ, సింహాచలం, పోలినాయుడు, లక్ష్మణరావు రైతులు పాల్గొన్నారు.